క్లుప్తంగా

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొమరోలు: ఇంటర్మీడియెట్ బెటర్‌మెంట్, సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం పూట, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం వేళ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్ బోర్డు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని, పరీక్షలు రాయడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులపై సర్వే

యర్రగొండపాలెం: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించినట్లు ఎంఈవోలు అంజనేయులు, మల్లూనాయక్ బుధవారం తెలిపారు. మండల స్థాయిలో గ్రామాలను రెండు క్లస్టర్లుగా విభజించి సహిత విద్యా రిసోర్స్ పర్సన్‌ల ద్వారా సర్వే చేపట్టామని పేర్కొన్నారు. ఈ సర్వే 40 రోజులపాటు కొనసాగుతోందని, 21 రకాల ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు పూర్తి చేస్తామని, ఈ వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో ధ్రువీకరించి సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపుతామని చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు రవాణా, ఎస్కార్ట్, రీడర్ చార్జీలు, ఉపకరణాలు, బోధన అభ్యాసన సామగ్రి, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందచేస్తారని తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో రేకుల షెడ్లు

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న కళాశాల భవనాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు


ఇటీవల ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద బంకులు


కళాశాల ప్రహరీ వెంట ఏర్పాటు చేసిన బంకులు

కంభం: ప్రభుత్వ స్థలాల్లో ఇష్టానుసారంగా బంకులు, పెద్దపెద్ద రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, తర్లుపాడు రోడ్డులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ప్రహరీ వెంట సుమారు 50కిపైగా రేకుల షెడ్లతో పలువురు బంకులు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో హైవే నిర్మాణంలో భాగంగా రోడ్డు వెంట ఉన్న నాలుగైదు నాయీ బ్రహ్మణుల బంకులు తొలగించడంతో వారు అధికారుల అనుమతులతో జూనియర్ కళాశాల ప్రహరీకి ఓ వైపున చిన్నపాటి బంకులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇదే అదునుగా చూసుకున్న పలువురు వారికి ఇష్టం వచ్చినట్లు పెద్ద పెద్ద సైజుల్లో బంకులు ఏర్పాటు చేసి పెట్టడం మొదలు పెట్టారు. కొందరు వారి సొంత స్థలం అన్న మాదిరిగా పెద్ద రేకుల షెడ్లు వేసి గోడౌన్లకు, ఇతర వ్యాపారాలకు అద్దెలకు ఇస్తున్నారు. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులకు పలువురు ఫిర్యాదు చేయగా నామమాత్రంగా నోటీసులు ఇచ్చి ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. పెద్ద సైజులో బంకులు ఏర్పాటు చేస్తుండటంతో వెనక ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల భవనాలు మూసుకుపోతున్నాయి. దుకాణాల్లోని వ్యర్థాలను సైతం కళాశాల క్రీడామైదానంలో పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. నివాస గృహాలకు, నూతన గృహాలకు కరెంటు మీటరు కనెక్షను కావాలంటే వంద నిబంధనలు పెట్టే విద్యుత్ శాఖాధికారులు వీరికి మాత్రమే మీటరు కనెక్షన్లు వెంటనే ఇచ్చేస్తున్నారు. బంకులు పెట్టుకొని వ్యాపారాలు సాగించే వారు పంచాయతీ అధికారులకు అద్దె చెల్లిస్తున్నామని చెబుతున్నారు. అద్దె చెల్లిస్తుంటే బంకుల సైజు అన్నీ ఒకేలా ఉండాలి కదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు లంచాలు ఇచ్చి ఎవరిష్టమొచ్చినట్లు వారు షెడ్లు వేసుకుంటున్నారన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో బంకుల ఏర్పాటు మరింత పెరిగిపోతోందని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన గేటు, ప్రహరీలను ఆనుకొని బంకులు ఏర్పాటు చేసుకోవడంతో వెనుక ఉన్న కళాశాల భవనాలు మూసుకుపోతున్నాయి. ప్రహరీ వెంట ఉన్న దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు ఉంచడం, యువకులు కూర్చుంటుండటంతో కళాశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయినులకు అసౌకర్యంగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మురళి, ఫిజికల్ డైరక్టర్

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల


స్వామి వారి పల్లకిని అగ్గి సేవతో ఊరేగిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మూలవిరాట్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు రేడియో బావి సమీపంలో అభయాంజనేయస్వామి ఆలయం నుంచి స్వామి వారిని అమ్మవార్లతో సహా ప్రత్యేక పల్లకిలో కొండమీద గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు అగ్గి సేవతో ఊరేగింపుగా మోసుకుంటూ తీసుకెళ్లారు. ఆలయంలోని మూలవిరాట్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని గిరిజానాథస్వామి ఆలయంలో, వేణుగోపాల స్వామి ఆలయాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చక స్వాములు నరసింహ స్వామి జయంతి సందర్భంగా నిర్వహించే తిరునాళ్ల మహోత్సవం వైభవం విశిష్టతతో పాటుగా నరసింహస్వామి అవతారం గురించి భక్తులకు వివరించారు. భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. 23న విజయవాడకు చెందిన నృత్య కళాకారులతో నృత్య ప్రదర్శన, 24న స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

25 మోటార్ సైకిళ్లు సీజ్

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని పాపినేని పల్లెలో కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై ఎం.అనిత ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. గ్రామంలో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి 25 మోటార్ సైకిళ్లు, రెండు ఆటోలను సీజ్ చేశారు. గ్రామంలో శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బేస్తవారిపేట, కంభం ఎస్సైలు నరసింహారావు, రాజేష్ పాల్గొన్నారు.


అర్ధవీడులో సీజ్ చేసిన బైక్‌లతో పోలీసులు

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ రమాదేవి

కంభం: పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు కావాల్సిన రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని మార్కాపురం ఏడీఏ రమాదేవి సూచించారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం వీఏఏలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో రైతులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. రబీ 2023–24 వర్షాధారంగా సాగు చేసిన పంటలకు సంబంధించి పంట నష్టపరిహారం జాబితా తయారు చేసుకునేందుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వర్షపాతం లేక పోవడంతో పంట నష్టపోయిన పంటలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా ప్రాథమిక పంటల వారీగా నష్టపరిహారం అంచనా పంపించినట్లు పేర్కొన్నారు. ఏఓ స్వరూపా, కంభం, అర్ధవీడు మండలాల వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహస్వామి జయంతి


నరసింహస్వామి కల్యాణ మహోత్సవం

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నరసింహస్వామి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బుధవారం తెల్లవారు జాము నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.

మెళకువలు పాటిస్తే గణితం సులువు


మాట్లాడుతున్న శేషకుమార్, పక్కన శివారెడ్డి

మార్కాపురం టౌన్: మెళకువలు పాటిస్తే గణితంలో భయం వీడి మంచి మార్కులు సాధించవచ్చని సాధన డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ ఎం.శేషకుమార్ తెలిపారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరానికి బుధవారం ఆయన హాజరై గణితంపై పలు సూచనలిచ్చారు. ఏకాగ్రతతో చదవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. చదువుతోపాటు ఆటలు, పాటలు నేర్చుకోవాలని లైబ్రేరియన్ జీవీ శివారెడ్డి సూచించారు.

యోగాపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథపాలకుడు

పెద్దదోర్నాల: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా తరగతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించారు. గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్, పాన్ అనుసంధానం చేసుకోవాలి

దర్శి: ప్రభుత్వ ఆదేశాల మేరకు దర్శి ఉప ఖజానాలోని పెన్షనర్లు ఆధార్ కార్డులు, పాన్ కార్డులను అనుసంధానం చేసుకోవాలని ఉప ఖజానా అధికారి సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 31వ తేదీ లోపు లింక్ చేయించుకోవాలని, లేకుంటే జూన్ నెలలో 20 శాతం ట్యాక్స్ కట్ అవుతుందని చెప్పారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఉత్సవ మూర్తులను ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వర్ణ, రజిత అభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, ఆలయ అర్చకుల వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. కమనీయ దృశ్యాలు వీక్షించేందుకు భక్తులు భారీగా బారులు తీరారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకొని కుంకుమ, కాయ, కర్పూరం సమర్పించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నరసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


చందన అలంకారంలో నరసింహస్వామి

చందన అలంకారంలో లక్ష్మీ నరసింహస్వామి

మార్కాపురం టౌన్: శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జన్మదిన ఉత్సవాల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో నరసింహస్వామి మూలవిరాట్‌కు అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చన చేశారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి వికాస తరంగిణి ఆధ్వర్యంలో నమ్మాళ్వార్ తిరునక్షత్ర మహోత్సవం సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రబంధ పారాయణం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా కపిల గిరిపై ఉన్న నరసింహస్వామివారు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తర్లుపాడులో వాహనాల తనిఖీ


తర్లుపాడులో మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో ఎస్సై వేముల సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తప్పనిసరిగా లైసెన్స్, ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పార్కింగ్, ఇతర నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయాలపై విద్యార్థులు ఆసక్తి చూపాలి


బేస్తవారిపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి


విద్యార్థులతో గ్రంథాలయ సిబ్బంది

గిద్దలూరు రూరల్: గ్రంథాలయాలపై విద్యార్థులు ఆసక్తి చూపేలా చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పడం, ఇంగ్లిష్, మ్యాథ్స్, వంటి విద్యతో పాటు చెస్, వైకుంఠపాళి, ఖోఖో, కుర్చీల ఆట వంటి క్రీడలపై ఆసక్తి కల్పించే కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయంలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమంలో పాల్గొని వారిలో దాగి ఉన్న విద్యానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎన్.ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు ఏటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, కథలు చెప్పడం, కథలు రాయించడం, డ్రాయింగ్, చెస్ నేర్పించారు. గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

లారీ, ట్రక్ ఢీ.. ఇద్దరికి గాయాలు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై నాయక్

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం నికరంపల్లి గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున లారీ, మినీ ట్రక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కథనం మేరకు.. ఐరన్ లోడ్‌తో కుంట వైపునకు వెళ్తున్న లారీ, ఎదురుగా వస్తున్న మినీ ట్రక్ ఢీకొనడంతో రెండు వాహనాల డ్రైవర్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.